RNI TELTEL 2024/90138

# సూర్య

జాతీయ తెలుగు దినపత్రిక

తెలుగు




హైదరాబాద్ । మేడ్చల్ । రంగారెడ్డి । మహబూబాద్ । కరీంనగర్ । అదిలాబాద్ । మెదక్ । వరంగల్ । ఖమ్మం । నిజామాబాద్ । నల్లగొండ । భద్రాద్రి కొత్తగూడెం

ప్రధాన సంపాదకులు : కురిమిళ్ల చంద్రశేఖర్ గౌడ్

ఆదివారం 29 - మార్చి - 2026 | సంపుటి : 05 | సంచిక : 011 | పేజీలు : 8 | వెల - 5

CIRCULATED IN HYDERABAD | MEDCHAL MALKAJGIRI | RANGAREDDY |KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | YADADRI BHUVANAGIRI | NALGONDA | NIZAMABAD | WARANGAL | MAHABUBABAD | MEDAK | ADILABAD | RANGAREDDY

CHIEF EDITOR: KURIMILLA CHANDRA SHEKAR GOUD

Sun day 29 - 03 - 2026 | VALLUM - 5 | ISSUE 011 | PAGES - 8 | RS 5 /







## మూసీని అడ్డుకుంటే శివతాండవమే

ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు

మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం

దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం

మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

2లో

## కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

అవినీతిని పట్టుకోవడంలో సిఎం రేవంత్ విఫలం

కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు

మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

2లో

కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

## కంచె చేను మేసినట్లుగా ఉంది

మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా

నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది

మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్

హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

2లో

అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్కడ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి

అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ

అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

2లో



## భద్రాచలంలో గవర్నర్ దంపతులు

2లో

### భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా

భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీరాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు.







## పొంగులేటి రాజీనామా చేయాలి

2లో

మైనింగ్ అనుమతుల్లేకుండానే ఆ కంపెనీ పొంగులేటిది కాదంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడిన సీఎం - భార్య, కొడుకు దూరపు బంధువులా? - అసెంబ్లీలో హరీశ్‌రావు ధ్వజం - హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ - స్పీకర్ పోడియం వద్ద బైఠాయింపు

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం లూటీ - మంత్రుల దీటైన కౌంటర్లు

## బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

### ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు.

2లో



## ఆర్‌బిఎల్ కుంభకోణంలో 139 కోట్ల లావావేవీలు

2లో

### 13మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

### సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపిన బ్యాంక్ సిబ్బంది

కరీంనగర్ కేంద్రంగా సాగుతున్న ఒక భారీ అంతర్జాతీయ సైబర్ నేరాల నెట్‌వర్క్‌ను కరీంనగర్ పోలీసులు చేధించారు. స్థానిక ఆర్‌బిఎల్ బ్యాంకును వేదికగా చేసుకుని సుమారు 139 కోట్ల రూపాయల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. 'ఆపరేషన్ క్రాక్ డౌన్'లో భాగంగా సాగించిన ఈ విచారణలో మ్యూల్ అకౌంట్ల ద్వారా సాగుతున్న ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటివరకు బ్యాంకు సిబ్బందితో సహా మొత్తం 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మోసంలో విస్తుపోయే నిజం ఏమిటంటే, సాక్షాత్తు బ్యాంకు మేనేజర్ , క్యాషియర్ నేరగాళ్లతో చేతులు కలిపారు. సైబర్ నేరగాళ్లు వివిధ ప్రాంతాల్లో బాధితుల నుండి కొట్టేసిన సొమ్మును ఈ బ్యాంకులోని కరెంట్ అకౌంట్లలోకి మళ్లించేవారు. నిందితులకు సహకరించినందుకు గాను బ్యాంకు సిబ్బంది భారీగా లబ్ధి పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితులు సుమారు 2,000 మందితో ఒక పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, కమిషన్ల ఆశ చూపి సామాన్య ప్రజల పేరుతో ఖాతాలను తెరిపించారు. ప్రతి లక్ష రూపాయల లావాదేవీకి అకౌంట్ హోల్డర్‌కు రూ. 2,000 కమిషన్ ఇస్తూ, వారి ఖాతాలను కేవలం ఒక ముసుగులా వాడుకున్నారు.

సూర్య
జాతీయ తెలుగు దినపత్రిక
ఆదివారం 29 - 03 -2026

## చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో గవర్నర్ దంపతులు

బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఏ ఆధ్వర్యంలో భద్రాచలంలో – భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

## పొంగులేటి రాజీనామా చేయాలి

రాష్ట్రంలో కంచే చేను మేస్తే.. అన్నట్లుగా మంత్రులే అక్రమాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎసఎల్పీ ఉపనేత హరీశ్‌రావు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ.. ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలోని జీవో 111 ప్రాంతంలో ఎలాంటి మైనింగ్, పర్యావరణ అనుమతుల్లేకుండా అక్రమ మైనింగ్ చేస్తోందని ఆరోపించారు. మినరల్ డీలర్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా అక్రమంగా మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. సీనరేజ్ చెల్లించకుండా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని, విద్యుత్ కనెక్షన్ కూడా తీసుకోలేదని, డీజిల్ జనరేటర్లతోనే భారీ ఎత్తున మైనింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం శాసనసభలో మైనింగ్ పద్దులపై చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మంత్రి పొంగులేటిపె తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో సభలో గందరగోళం చెలరేగింది. విపక్ష బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టిన 'హౌస్ కమిటీ' డిమాండ్, అధికార పక్షం ఇచ్చిన గట్టి కౌంటర్లతో సభ స్తంభించింది. మూసీని ప్రక్షాళన చేస్తానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను తొలగిస్తున్నారని, కానీ.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్‌తో మూసీ నది, గండిపేట, హిమాయత్‌సాగర్ కలుషితం అవుతున్నాయని మైనింగ్ అధికారులు చెప్పినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. మరోవైపు పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తమ్ముడికి చెందిన స్టోన్‌క్రషర్ యూనిట్‌లో చిన్న తప్పు జరిగిందంటూ రాత్రికి రాత్రే అరెస్టు చేసి నెలరోజులు జైల్లో పెట్టారని గుర్తుచేశారు.

## ఆర్‌బిఎల్ కుంభకోణంలో 139 కోట్ల లావావేవీలు

బ్యాంకులోని కరెంట్ అకౌంట్ల ద్వారా జరిగిన ఈ వందల కోట్ల లావాదేవీలు పోలీసులకు అనుమానం కలిగించాయి. ఖాతాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, దేశవ్యాప్తంగా జరిగిన సైబర్ నేరాల సొమ్ము ఇక్కడికే చేరుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ అక్రమ సొమ్ము కేవలం దేశానికే పరిమితం కాకుండా చైనా , దుబాయ్ వంటి దేశాలకు కూడా మళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆర్‌బిఎల్ బ్యాంకుతో పాటు నగరంలోని మరో రెండు మూడు ప్రైవేట్ బ్యాంకుల్లో కూడా ఇదే తరహా అక్రమాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం అరెస్ట్ అయిన 13 మంది నిందితులను విచారిస్తున్న పోలీసులు, ఈ చైన్ నెట్‌వర్క్‌లో ఉన్న మరికొంత మంది కీలక వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ప్రజలు తమ బ్యాంకు ఖాతాలను ఇతరులకు వాడటానికి ఇచ్చి అనవసరమైన చిక్కుల్లో పడకూడదని, తక్కువ శ్రమతో వచ్చే అదనపు ఆదాయం వెనుక పెద్ద మోసాలు ఉండవచ్చని కరీంనగర్ పోలీస్ యంత్రాంగం హెచ్చరిస్తోంది. 'ఆపరేషన్ క్రాక్ డౌన్' ద్వారా ఈ నెట్‌వర్క్ మూలాలను పూర్తిగా చేధిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

## బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్–2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

## భక్తి ముసుగులో హింసను ప్రేరేపించడం దారుణం: భానుప్రకాశ్ రెడ్డి

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై జరిగిన దాడి ప్రయత్నాన్ని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, రాజకీయ ప్రయోజనాల కోసం దాడులకు తెగబడటం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని మండిపడ్డారు.కొన్ని దుష్టశక్తులు ఆకివీడులో కావాలనే అరాచకాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూసే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తి ముసుగులో హింసను ప్రేరేపించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు తాను త్వరలోనే ఆకివీడులో పర్యటిస్తానని, స్వయంగా ఘటనాస్థలిని పరిశీలిస్తానని భానుప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని స్పష్టం చేశారు.

## నాసిరకం ఉస్మానియా బిస్కట్ల తయారీ టాస్క్‌ఫోర్స్ టీయ్ దాడి: వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్‌లో కొందరు వ్యక్తులు నాసిరకం ఉస్మానియా బిస్కెట్లు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు. ఇప్పటికే అలాంటి ఓ పరిశ్రమను పోలీసులు సీజ్ చేశారు. తాజాగా మరో ఫ్యాక్టరీని కూడా సీజ్ చేశారు. హైదరాబాద్‌లోని కేడీ కాలనీ పరిధిలో ఎటువంటి అనుమతులూ లేకుండా, అపరిశుభ్ర వాతావరణంలో నడుస్తున్న ఉస్మానియా బిస్కెట్ల తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. భారీ మొత్తంలో నిల్వ ఉంచిన బేకరీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అహ్మద్ రజా అనే వ్యక్తి పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో, నాసిరకం ముడి సరుకులతో ఉస్మానియా బిస్కెట్లను తయారు చేస్తున్నాడు. ఉత్పత్తులను నగరంలోని వివిధ కిరాణా షాప్‌లు, హోటళ్లు, బేకరీలు, కేఫ్స్‌లకు సరఫరా చేస్తున్నాడు . ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ అతడి తయారీ కేంద్రంపై దాడి చేసింది. అక్కడ ఉన్న యంత్రాలను, ముడి పదార్థాలను, ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంది. అహ్మద్ రజాను అరెస్ట్ చేసింది.

## గుంటూరు జిజిమెచ్ నుంచి ఖైదీ పరార్

గుంటూరులోని జీజీహెచ్ నుంచి ఓ రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. తెనాలి వన్ టౌన్ పీఎస్ పరిధిలో అజిత్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. రిమాండ్ కోసం రేపల్లె సబ్ జైల్‌కు తరలించారు. అనారోగ్య కారణాలతో మూడ్రోజుల క్రితం జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ పోలీసుల కళ్లు కప్పి నిందితుడు పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గతంలోనూ ఒంగోలులో పోలీసుల కళ్లుకప్పి అజిత్ కుమార్ తప్పించుకున్నట్లు సమాచారం.

## భూములు లాక్కుంటే చూస్తూ కూర్చోవాల?: సబిత

ప్రజలకు నష్టం జరిగితే.. ఆరు నూరైనా అడ్డుకొని తీరుతామని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తారని సీఎం అంటున్నారని, ఆయన మాటలకు భయపడేది లేదని చెప్పారు. రెండేళ్లు ఆగితే ప్రజలే కాంగ్రెస్‌ను బహిష్కరిస్తారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన పేరుతో 10 వేల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. మూడు వేల ఎకరాలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మేం మూసీకి వ్యతిరేకం కాదు.. ప్రభుత్వం దోపిడీకి వ్యతిరేకం. ఇళ్లు, భూములు లాక్కుంటుంటే మేం చూస్తూ కూర్చోవాలా? ప్రజల కోసం కోర్టులకే కాదు.. ఎంత దూరమైనా వెళ్తాం అని సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

## పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

సంగారెడ్డి జిల్లా కంది మండలం జులకల్‌లో శనివారం దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలకు విషమిచ్చిన తల్లి.. తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతులను మమత (28), కుమారుడు మణికంఠ (5), కుమార్తె ప్రళయ (4) గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జనవరిలో రోడ్డు ప్రమాదంలో మమత భర్త మృతి చెందాడు. భర్త చనిపోయడాని మనస్తాపానికి గురైన మమత పిల్లలతో కలిసి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జులకల్ చేరుకొని వివారాలు సేకరిస్తున్నారు.

## ఫుట్‌బాట్ క్రీడాకారిణి పట్ల అసభ్య ప్రవర్ధన పోలీసుల కేసు నమోదు

జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న క్రీడాకారిణితో కొందరు వ్యక్తులు అసభ్యంగా ప్రవర్తించారు. కుక్క విషయంలో మొదలైన గొడవ చివరకు క్రీడాకారిణి కుటుంబానికి ప్రాణభయంగా మారింది. కొందరు మందుబాబులతో క్రీడాకారిణికి కుక్క విషయంలో గొడవ జరిగింది. దీంతో వారు ఆమెను వేధించడం ప్రారంభించారు. హయత్ నగర్ పరిధిలో నివసిస్తున్న ఆమె ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోకి చొరబడి క్రీడాకారిణి, ఆమె చెల్లెళ్లతో అసభ్యంగా ప్రవర్తించారు. రోజూ వారి ఫోటోలు తీసి వేధిస్తున్నారు. మందుబాబుల దాడిలో గాయపడిన క్రీడాకారిణి హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభిచారు.

## బెంగాల్లో గెలిచాక ఢిల్లీలో పాగా వేస్తాం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

## చలో హైదరాబాద్‌కు ఆశాల పిలుపు ఎక్కడిక్కడే పోలీసుల అరెస్ట్

చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అరెస్టులకు పాల్పడ్డారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్‌టీయూ నేతలు, ఆశావర్కర్లు ముందస్తుగా అనుమతులు తీసుకున్నారు. కానీ ర్యాలీకి పర్మిషన్ ఇచ్చినట్లే ఇచ్చి బీఆర్‌టీయూ ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేసారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్; కార్యదర్శి మారయ్యను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు ఎక్కడికక్కడ అరెస్టు చేసారు. పోలీసుల తీరుపై ఆశావర్కర్లు, బీఆర్‌టీయూ నేతలు మండిపడుతున్నారు. ధర్నాకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఎందుకు అరెస్టు చేస్తున్నారని పోలీసులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు దక్కుతున్న గౌరవమిదేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీరుతామని స్పష్టం చేశారు.

## బస్సును ఢీకొన్న కంటెయినర్

వైరా పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. భద్రాచలం వెళ్తున్న ఖమ్మం బస్సును కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో 25 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

## ఏడాది చివరికి ఉడాన్ యాత్రి కెఫేలు

ఈ ఏడాది చివరి నాటికి అన్ని విమానాశ్రయాల్లో 'ఉడాన్ యాత్రి కెఫేలు' అందుబాటులోకి వస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఇప్పటికి 13 విమానాశ్రయాల్లో ఉన్నాయని, ఆదివారం రాజ్‌కోట్ వేదికగా మరో 11 విమానాశ్రయాల్లో ప్రారంభిస్తామని అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాజ్‌కోట్, ఛండీగఢ్, ఇండోర్, జమ్ము, పట్నా, అమృత్‌సర్, వారణాసి, గ్వాలియర్, అగర్తలా, జయపుర, లఖ్‌నవూ విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫేలు

## మూసీని అడ్డుకుంటే శితాండవమే

రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

## కంచె చేను మేసినట్లుగా ఉంది

జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్ష్టక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు. వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతు న్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు సభలో సంచలన కామెంట్స్ చేశారు. తన వ్యాఖ్యలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ విసిరారు.

# ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**
**పరీక్షా కేంద్రంలో సీసీటీవీల పనితీరు పరిశీలన**
**మౌలిక వసతులపై ఆరా**
**జవాబు పత్రాలను పోలీసులు బందోబస్తుతో తరలించాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చ్ 28 సూర్య న్యూస్ పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నా యని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పరీక్షల నిర్వహణ సరళిని క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు వ్రాయాలని సూచించారు. పరీక్ష కేంద్రంలో సీసీ టీ.వి నిర్వహణను పరిశీలించారు. తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరం వంటివి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్ష పూర్తయిన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణలో నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన

**నర్సింహులపేటలో వ్యవసాయ శాఖ కార్యక్రమం**
**మండల వ్యవసాయ అధికారి, జి. వినయ్ కుమార్**



నర్సింహులపేట మార్చి28సూర్య న్యూస్ :- నర్సింహులపేట మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయంపై ప్రాథమిక అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యవసాయ శాఖ పాత్ర, రైతులకు అందించే సేవలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించారు. మండల వ్యవసాయ అధికారి జి. వినయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. పంటల ఉత్పత్తి పెంపు, నేల ఆరోగ్యం పరిరక్షణ, నీటి వినియోగంలో సమర్థత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే నాణ్యమైన విత్తనాల వినియోగం, సరైన ఎరువుల వాడకం, పంటలను పురుగులు మరియు వ్యాధుల నుంచి రక్షించుకునే పద్ధతుల గురించి వివరించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు భరోసా, పంట బీమా, పీఎం కిసాన్ వంటి పథకాలపై కూడా విద్యార్థులకు సమాచారం అందించారు. భవిష్యత్తులో యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# హాస్టల్ పిల్లలకు విద్య తో పాటు నాణ్యమైన ఆహారం అందించాలి





**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**
**మోత్కూర్ లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ**
**నాణ్యమైన వంట సరుకులు తాజా కూరగాయలనే వాడాలి**
**మెనూ తప్పనిసరిగా పాటించాలి**
**ప్రతి విద్యార్థి శ్రద్ధతో మంచిగా చదువుకోవాలి**
**విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్**
**బాత్రూములు ప్రతి రోజు శుభ్రం చేయాలి**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చి 28 సూర్య న్యూస్ సంక్షేమ హాస్టల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మోత్కూర్ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రెసిడెన్షియల్ స్కూల్ లో విద్యార్థుల వసతులు ఎలా ఉన్నాయని హాస్టల్ ను పరిశీలించారు. హాస్టల్ లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని ఎంత మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని, టీచర్స్ అందరు ఇక్కడే ఉంటారా, స్కూల్ లో మంచి నీటీ సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉన్నాయా లేవా అని కలెక్టర్ స్వయంగా వెళ్లి పరిశీలించారు . ప్రతి రోజు రెగ్యులర్ గా శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చుట్టూ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకి మధ్యాన్నం భోజనం మెనూ ప్రకారం ఆహారం పెడుతున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. కిచెన్ రూమ్ లోకి వెళ్లి వంట సామాగ్రి ని, స్టోర్ రూమ్ లో వంట సరుకులు,కూరగాయలు, పప్పు, ధాన్యాలు, గుడ్లు, ఆయిల్ క్వాలిటీ వాడుతున్నారా లేదా అని పరిశీలించారు.

నాణ్యమైన వంట సరుకులు,తాజా కూరగాయలు మాత్రమే వాడాలన్నారు. హిమేష్ అనే విద్యార్థి తో కలెక్టర్ మాట్లడుతూ ఏ క్లాస్ చదువుతున్నావ్, బాగా చదువుతున్నావా, పెద్ద అయ్యాక ఏమి అవ్వాలనుకుంటున్నావ్ అని విద్యార్థిని అడగడం జరిగింది. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయి కి చేరుకోవాలన్నారు. మీ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల తో కలసి మధ్యాహ్నం భోజనం చేసిన కలెక్టర్. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కురవి మండల కమిటీ ఎన్నికలు

**అధ్యక్షుడిగా కిన్నెర మల్లయ్య ఎంపిక**
**తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఆనాటి నాయకులకు గుర్తింపు.**



డోర్నకల్ మార్చి 27 సూర్య న్యూస్:- కురవి, మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీ.యూ.ఫ్.) కురవి మండల కమిటీ ఎన్నికలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో కిన్నెర మల్లయ్యను మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వ్యాప్తంగా ఉద్యమకారులు, నాయకులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఉపాధ్యక్షులుగా చిన్నంబాస్కర్‌తో పాటు బండి మాధవ్, దారావత్ భాస్కర్, బుక్క నాగరాజు, బసవ వీరేష్‌లు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గాడిపల్లి రాములు బాధ్యతలు చేపట్టగా, సహాయ కార్యదర్శులుగా ఎస్.కే నబి, సర్కాపెల్లి నరసయ్య, కాట్యాల వీరన్నలను ఎన్నుకున్నారు. ప్రచార కార్యదర్శులుగా రొయ్యల నాగేశ్వరరావు, ధర్మసోత్ బాలు, బాదావత్ బాలు బాధ్యతలు స్వీకరించగా, సంయుక్త కార్యదర్శులుగా పాశం వెంకటేశ్వర్లు, గణాచారి బాబురావు, పెరుమండ్ల వేదనాయకం ఎంపికయ్యారు. కోశాధికారిగా భూక్య శోభన్ బాబు నియమితులయ్యారు. గౌరవ సలహాదారులుగా తోట లాలయ్య, గుగులోత్ రవి, యానాల గంగాధర్ రెడ్డి, బండి దీపక్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కిన్నెర మల్లయ్య మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ జిల్లా యూత్ అధ్యక్షుడు తుపాకుల రామచందర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమ ఆత్మను గ్రామ స్థాయికి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# జన గణన పారదర్శకంగా సమగ్రంగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ భాస్కరరావు - మే 11 నుంచి జనగణన ప్రారంభం**
**కుటుంబానికి సంబంధించిన ప్రతి విషయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలి**
**ప్రతి అధికారి నిబద్ధతతో పనిచేయాలి**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చ్ 28 సూర్య న్యూస్ జన గణన 2027 ను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జనగణన- 2027 ఫేజ్ 1 గృహాల గణనకు సంబంధించి క్షేత్రస్థాయి శిక్షకుల (ఫీల్డ్ ట్రైనర్స్) శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మే 11 నుండి ప్రారంభమయ్యే గృహాల గణనలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి వివరాన్ని కచ్చితంగా నమోదు చేసే విధానాన్ని సమగ్రంగా చేపట్టాలన్నారు. ప్రతి అధికారి తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణను సమగ్రంగా, నాణ్యంగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనగణన అధికారి వెంకటరమణ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడి హెచ్చరిక

మీకు అభివృద్ధి, భద్రత, శాంతి కావాలనుకుంటే, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను మీ భూభాగాల మీద నుండి దాడులు చేయకుండా నిరోధించాలని గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తమ పొరుగు దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ దేశాలలోని స్థావరాల నుంచి అమెరికా ఇరాన్‌పై దాడులు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేశారు. గల్ఫ్ దేశాలపై దాడులు ఆగాలన్నా, శాంతి, అభివృద్ధి నెలకొనాలన్నా తాము చెప్పినట్లు వినాలని స్పష్టం చేశారు. ఆయా దేశాల గగనతలాలను వినియోగించుకుని శత్రువులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గగనతలాలను వినియోగించుకోవడానికి అమెరికా, ఇజ్రాయెల్‌లకు అనుమతి ఇవ్వవద్దని షరతు విధించారు.

# చెత్తను మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలి

**మున్సిపల్ కమిషనర్ రామలింగం - రోడ్లపై ఖాళీ స్థలాల్లో చెత్త వేయవద్దు - రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా**
**చెత్త వాహనం రాకపోతే సంబంధిత అధికారులకు తెలియజేయాలి**



యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చ్ 28 సూర్య న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా,భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని గృహ, వాణిజ్య వ్యాపారము కలిగినవారందరు తమ తమ ఇండ్లకు, షాపులకు సంబంధించిన చెత్తను ఖచ్చితముగా ఇంటింటికి వచ్చు మున్సిపల్ స్వచ్ఛ ఆటోకు మాత్రమే ఇవ్వాలని భువనగిరి మున్సిపల్ కమిషనర్ రామలింగం విజ్ఞప్తి చేశారు. రోడ్లపై, ఇంటి ప్రక్కన ఉన్న ఖాళీ స్థలాలలో చెత్త వేయకూడదని, ఆ విధముగా చెత్త వేస్తే అక్కడ ఉన్న వీధి కుక్కలు, పందులు, కోతులు అలువాటు పడి గృహ నివాసలలో చొరబడి ప్రమాదకరముగా మారుతున్నాయని తెలిపారు. పట్టణ ప్రజలందరు పురపాలక సంఘానికి సహకరించి, చెత్తను రోడ్లపై వేయకుండా కేవలం మున్సిపల్ స్వచ్ఛ ఆటోకు మాత్రమే అందజేయాలని కమిషనర్ తెలిపారు. ఒక వేళ మీ ఇంటికి చెత్త వాహనము రాకపోయినా, వాహనము ఆగకపోయినా పురపాలక సంఘ కార్యాలయము, సంబంధిత ఏరియా జవాన్ కు,శానిటరీ ఇన్స్పెక్టర్స్ ఫోన్ నెం. 8247820991కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలా కాకుండా రోడ్లపై చెత్త వేస్తే పురపాలక సంఘ అధికారులు చెత్త వేసిన వారికి జరిమానం విధించడం జరుగుతుందని కమిషనర్ రామలింగం ప్రజలకు చెలియ చేశారు.

# అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం



వలిగొండ మార్చి 28 సూర్య న్యూస్: వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామానికి చెందిన బోగారం మైసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొడితాల నాగరాజు శనివారం బాధితురాలని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ 6వ వార్డు సభ్యులు బాసాని శ్రీనివాస్, నాయకులు ఓరుగంటి స్వామి, బత్తిని నాగేష్, జినుకల కృష్ణ, బిఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు నిలిపివేసిన ఘనత కాంగ్రెస్ దే....!

రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:- కారుణ్య నియామకాలను నిలిపివేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని సింగరేణి సంస్థ ఆర్జీ3 పరిధి ఓసిపి 1 తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఫిట్ సెక్రటరీ గిటుకు శ్రీనివాస్ ఆరోపించారు. గని సైట్ ఆఫీస్ వద్ద ఉద్యోగులందరికీ నల్ల బ్యాడ్జీలు పెట్టి మేనేజర్ ఆర్. పాపయ్య వినతి పత్రం అందించి మాట్లాడారు. గత సంవత్సర కాలంగా కారుణ్య నియామకాలను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, ఐఎన్టియుసి యూనియన్ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కి రెండేళ్ల పాలనలో కేసీఆర్ అమలు చేసిన కారుణ్య నియామకాలను బొంద పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన రెండేళ్లలో సింగరేణి ఉద్యోగులకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయకపోగా గతంలో ఉన్న వాటిని ఊడగొట్టారని విమర్శించారు. డిసెంబర్ 23 సింగరేణి డే, కొత్త సంవత్సర క్యాలెండర్ లాంటి చిన్న వాటిని కూడా సాధించలేకపోయారన్నారు. ఇప్పటికీ కూడా మా ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపడుతుందని, ఉద్యోగుల సొంత ఇంటి కల నెరవేర్చుతామని, పెర్క్స్ పై రద్దు చేస్తామని చెబుతూ ఉద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి, బేస్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ భోగం పూర్ణాకర్, ఫిట్ సెక్రటరీలు సైన్ల సత్యనారాయణ, శ్రీనివాస్, చుక్కల కుమార్, మల్లేశం, సెంట్రల్ కమిటీ నాయకులు కే. శ్రీకాంత్ రావు, డివిజన్ కమిటీ నాయకులు అల్లం తిరుపతి, మైపాల్ రెడ్డి, టి. ప్రవీణ్, పిట్ కమిటీ నాయకులు కే. రవి, రవీందర్, కమ్మర్, వేణుగోపాల్, మహేందర్, ప్రవీణ్, కార్మికులు పాల్గొన్నారు.



# స్వర్ణగిరిలో పూర్తయిన వసంత నవరాత్రి ఉత్సవాలు







**స్వామివారికి సుగంధ భరిత ద్రవ్యాలతో నవకలశ పంచామృతాభిషేకం**

**ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుదీరిన గోపృష్ట దర్శనం**

**సువర్ణ బిందుతో బంగారు బావి నుండి తీసుకొచ్చిన తీర్థంతో శ్రీవారికి అభిషేకం**

**శ్రీరామ పట్టాభిషేక సర్గ పారాయణం**

**అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం**

**శ్రీ స్వామివారి మహా అన్నప్రసాదాన్ని స్వీకరించిన 5000 మంది భక్తులు**

**స్వామివారిని దర్శించుకుని దివ్య అనుగ్రహం పొందిన వేలాది మంది భక్తులు**

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చి 28 సూర్యా న్యూస్** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించడం జరిగింది. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు,ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణ లతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా 5000 మంది భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

**స్వర్ణగిరిలో పూర్తయిన వసంత నవరాత్రి ఉత్సవాలు**

**వేడుకగా శ్రీ రామ పట్టాభిషేకం** భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించబడిన వసంత నవరాత్రి మహోత్సవాలు ఘనంగా, ఆధ్యాత్మిక వైభవంతో సంపూర్ణమయ్యాయి. ఉత్సవాల చివరి దినమైన శనివారం, శ్రీ రామాయణ పారాయణ క్రతు మహాయజ్ఞం వేదమంత్ర ఘోషల మధ్య సమాప్తి చెంది, పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడినది. అనంతరం శ్రీ స్వామివారికి సుగంధ భరిత ద్రవ్యాలతో నవకలశ పూర్వక పంచామృతాభిషేకం అర్చక స్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడినది. తదనంతరం శ్రీ రామ పట్టాభిషేక సర్గ పారాయణం జరిపి, కుంభ ప్రోక్షణ కార్యక్రమం వైభవంగా నిర్వహించబడినది. ఈ మహోత్సవ సందర్భంలో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోగా, భక్తజనులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దివ్య అనుగ్రహాన్ని పొందినారు.



# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**వలిగొండ మార్చి 28 సూర్య న్యూస్ :-** వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామపంచాయతీ మధిర గ్రామమైన అప్పారెడ్డిపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద విడుదలైన రూ.10 లక్షల విలువ గల సిసి రోడ్లకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి, గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు కొబ్బరికాయ కొట్టి శనివారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించడానికి కృషి చేస్తామని వారన్నారు. గ్రామ సమస్యలపై శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి తెలియపరచగా గ్రామ అభివృద్ధికి ప్రత్యేకమైన కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, ఆవుల స్వామి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**వలిగొండ మార్చి 28 సూర్య న్యూస్ :-** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా వైద్య శిబిరాన్ని శనివారం ఆరోగ్య ఉప కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెముడాల అనిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ఆమె అన్నారు. వైద్య శిబిరంలో వందమంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఖజా, డాక్టర్ వందన, డాక్టర్ గాంధీ, డాక్టర్ కీర్తన, వైద్య సిబ్బంది శ్రావణ్ కుమార్, అశోక్, చంద్రమోహన్, సుధాకర్, సీజ్ని, సాలమ్మ, నమ్రత, లక్ష్మి, లక్ష్మీనరసమ్మ, జ్యోతి, వెలువర్తి, కేర్చిపల్లి, మొగిలిపాక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నృత్య కళాకారులకు సత్కారం

**-చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహించడం సమాజం యొక్క బాధ్యత**

**-క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్**



**రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:-** రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ శారద నృత్య కళాపీఠం వారిచే అద్భుతమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి నృత్య గురువు విష్ణు మార్గదర్శకత్వం విశేషంగా నిలిచింది. ప్రదర్శన అనంతరం నృత్యం చేసిన చిన్నారులకు ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ సభ్యుల సహకారంతో క్లబ్ ప్రెసిడెంట్ మేకల మారుతి యాదవ్, డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో చిరు సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహించడం సమాజం యొక్క బాధ్యత అని, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి సేవలందిస్తున్నారని, ఆలయ కార్యక్రమాలకు అందిస్తున్న సహకారం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ చైర్మన్ వనం రామచందర్ రావు, కార్యదర్శి రవీందర్, వైస్ చైర్మన్ కాటం సత్యం, భక్తులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కొత్త కమిటీల ఏర్పాటుకు పరిశీలకుల నియామకం



**హనుమకొండ టౌన్ మార్చి 28 సూర్య న్యూస్:-** వర్ధన్నపేట నియోజకవర్గ మండల, డివిజన్ కమిటీల ఏర్పాటుకు (ఆబ్జర్వర్ల) పరిశీలకుల నియామకం చేపట్టారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న పాత కమిటీలను రద్దు చేయడం జరిగిందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో, వర్ధన్నపేట నియోజకవర్గంలోని వివిధ మండలాలు, డివిజన్లకు నూతన కమిటీలను నియమించే ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఆబ్జర్వర్లను (పరిశీలకులను) నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

**మండలాల వారీగా నియమించబడిన ఆబ్జర్వర్ల వివరాలు**

హాసన్పర్తి మండలానికి కురాల మోహన్, కాజీపేటకు చెందిన జి. శ్రీనివాస్ రెడ్డి.

ఐనవోలు మండలానికి కుందూర్ వెంకట్ రెడ్డి, పింగిలి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, బిల్లా ఉదయ్ రెడ్డి, మదన్ గౌడ్,పి.సారంగపాణి. క్లస్టర్-1 (జి డబ్ల్యూ ఎం సి డివిజన్లు 44, 45, 46, 64)కు జన్ను అనిల్, గడ్డం శివరాం ప్రసాద్ క్లస్టర్-2 (జి డబ్ల్యూ ఎం సి డివిజన్లు 55, 56, 65, 66) కు సింగ్ లాల్, మార్నేని రవీందర్ రావు, పిన్నింటి అనిల్ రావు. క్లస్టర్-3 (జిడబ్ల్యుఎంసీ డివిజన్లు 1, 2) కు శంకర్ రెడ్డి, ఋగ్వేద్ రెడ్డి,కె. ప్రభాకర్ గౌడ్. నియమించబడిన ఆబ్జర్వర్లు వెంటనే క్షేత్రస్థాయిలో ప్రస్తుత మండల అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రస్తుత కార్పొరేటర్లు, గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, పోటీ చేసి ఓడిపోయిన సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా,రాష్ట్ర స్థాయి నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, చర్చించి అందరి సమన్వయంతో పేర్లను ఖరారు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది.క్రింది మార్గదర్శకాల ప్రకారం ఈ కమిటీల నియామకం ఉంటుందని తెలిపారుసామాజిక ప్రాతినిధ్యం కమిటీ ఎంపికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పించాలి.మహిళా రిజర్వేషన్ ముఖ్యంగా మహిళలకు 30% ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని రెక్వెస్ట్ చేస్తున్నాము. వయోపరిమితి పార్టీ బలోపేతం దృష్ట్యా మండల స్థాయి కార్యావర్గాల్లో (35 సంవత్సరాల పైబడిన వారికే) ప్రాధాన్యతనిస్తూ కమిటీలను రూపొందించాలి. అర్హత మండల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులు కనీసం మూడు సంవత్సరాల పాటు పార్టీకి చురుకైన సేవా అందించి ఉండాలి. జిల్లా పరిధిలోని రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మండల, మునిసిపల్, కార్పోరేషన్ డివిజన్ అధ్యక్షులను తప్పనిసరిగా మార్చాల్సిన అవసరం ఉందని హనుమకొండ డిసిసి ప్రెసిడెంట్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తెలిపారు.

# విప్‌గా నియామకం తర్వాత యెన్నం శ్రీనివాస్ రెడ్డి కి శుభాకాంక్షల వెల్లువ



**మహబూబ్‌నగర్ టౌన్ మార్చి 28 సూర్య న్యూస్ :-** ప్రభుత్వ విప్‌గా నియామకం అనంతరం మహబూబ్‌నగర్‌కు వచ్చిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డికి పట్టణంలో అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ కార్పొరేషన్ 22వ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీ, పంచముఖి కాలనీ లకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను అభినందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.రఘురామ్ రెడ్డి, జజప్ప, భాస్కర్ రెడ్డి, ఆనంద్ కుమార్, శ్రీనాథ్ రెడ్డి, మోహన్ గౌడ్, శ్రీనివాస్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మధుమేహ పరీక్ష శిబిరం



**హనుమకొండ టౌన్ మార్చి 28 సూర్య న్యూస్:-** షుగర్ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉంటూ, పరీక్షలు చేయించుకుంటూ, డాక్టర్స్ సలహా ప్రకారం నడుచుకోవడం వల్ల ఇబ్బందులుండవని డాక్టర్ రంజిత్ రావు అన్నారు. హసన్పర్తి మండల కేంద్రంలోని ఎర్రగట్టు గుట్ట బాలాజీ గార్డెన్స్ వెనుక సూర్య టవర్స్ లో శనివారం రోజు సత్య సాయి, వాసవి క్లబ్ హసన్ పర్తి అధ్వర్యంలో డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీస్ సెంటర్, హనుమకొండ వారు ఉచిత మధుమేహ ప్రత్యేక శిబిరం నిర్వహించగా దాదాపు 100 మంది పరీక్షలు చేయించుకున్నారు. ఈ క్యాంపులో మేనేజర్ శ్రవణ్, ప్రమోద్, శ్రేయ పరీక్షలు చేయగా పాపిశెట్టి శ్రీధర్, చకిలం రాజేశ్వర్ రావు, గౌరిశెట్టి కృష్ణమూర్తి, సంద్రు నాగేందర్, దూబల భాస్కర్, పుల్ల దుర్గారాం, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్‌లో చేరండిమీ సేవతో సమాజంలో మార్పు తీసుకురండి

**క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్**



**రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:-** లయన్స్ క్లబ్‌లో చేరండి, మీ సేవతో సమాజంలో మార్పు తీసుకురావాలని లైన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ పిలుపునిచ్చారు. లైన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో సెంటినరీ కాలనీ పరిసర ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ ప్రజల హృదయాలను గెలుచుకుంటున్న లయన్స్ క్లబ్ సమాజ సేవలో భాగస్వాములు కావాలనుకునే వారికి ఒక మంచి అవకాశాన్ని అందిస్తోందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యత్వం ద్వారా వ్యక్తికి సేవ చేసే అవకాశం మాత్రమే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి కూడా విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. పేదల సంక్షేమం, కంటి శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కార్యక్రమాల్లో సభ్యులు చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఈ సభ్యత్వం ద్వారా సమాజానికి నేరుగా సేవ చేసే అవకాశం, నాయకత్వ లక్షణాల అభివృద్ధి, కొత్త పరిచయాలు, స్నేహబంధాల ఏర్పాటుతో పాటు, సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. సేవ ద్వారా మనసుకు అపారమైన సంతృప్తి కూడా పొందవచ్చున్నారు. లయన్స్ క్లబ్‌లో చేరడం అనేది కేవలం ఒక సభ్యత్వం మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేసే ఒక బాధ్యత, ఒక గౌరవంగా భావించాలన్నారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పం ఉన్న యువత, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, సింగరేణి ఉద్యోగస్తులు ముందుకు వచ్చి లయన్స్ క్లబ్ సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. సభ్యత్వం కోసం క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి 9849655990ని సంప్రదించాలని సూచించారు.

# సామాజిక సేవే పరమావధిగా కిట్స్ వాకర్స్ సభ్యులు

**శ్రీరామనవమి సందర్భంగా కిట్స్ వాకర్స్ భక్తులకు మజ్జిగ పాకెట్ల పంపిణీ**

**హనుమకొండ టౌన్ మార్చి 28 సూర్య న్యూస్:-** శుక్రవారం రోజున శ్రీరామనవమి పండుగ సందర్భంగా కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొక్క కుమారస్వామి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయము హసన్పర్తి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయము, ఆర్టీసీ కాలనీలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఉచితముగా మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 303 ఇంటర్నేషనల్ వాకర్స్ గవర్నర్ పుల్లూరు శ్రీనివాస్ గౌడ్, డిప్యూటీ గవర్నర్ నాగమల సుధీర్, గౌరవ అధ్యక్షులు పాపి శెట్టి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ పుల్లూరు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కిట్స్ వాకర్స్ అసోసియేషన్ వారు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం ఉత్సవాలకు వచ్చినటువంటి భక్తులకు దాహం తీర్చడానికి ఉచితముగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం హర్షనీయమని ఇకముందు కూడా వాకర్స్ కేవలం వాకింగ్ తో ఆరోగ్యము పరిరక్షించుకోవడమే కాకుండా సమాజ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో నన్ను భాగస్వామ్యం చేయడం చాలా ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొక్క కుమార్ మాట్లాడుతూ మర్యాద పురుషోత్తముడు ధర్మానికి నిలువెత్తు నిదర్శనమని, మన భారతీయుల ఇలవేల్పు శ్రీ సీతారామచంద్ర స్వాముల కళ్యాణమునకు విచ్చేసిన భక్తులకు ఉచితముగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం గొప్ప మహాత్భాగ్యంగా భావిస్తున్నానని అన్నారు. గాంధీ జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వంటి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నామని తెలిపారు. తదనంతరం కిట్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొక్క కుమార్, డిప్యూటీ గవర్నర్ నాగమల్ల సుధీర్, జిల్లా బాధ్యులు ఆర్మీ మల్లేష్ మహాత్మా గాంధీ ఫెలోషిప్ పదివేల రూపాయలు చెల్లించి ఇంటర్నేషనల్ వాకర్స్ యందు సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు కోశాధికారి గూడూరు లక్ష్మీనారాయణ మాజీ అధ్యక్షుడు పుల్లా దుర్గారామ్ సలహాదారు బోడ యుగంధర్ వాకర్స్ మిత్రులు గుండ మీది విజయమోహన్, గొల్ల సాంబయ్య, మురాల శంకర్రావు, బొక్క కిషన్, మసన కుమార్, ఆకుల సదానందం, కనిపర్తి రమేష్, గుడి కందుల అశోక్, వల్లాల శ్రీకాంత్, వీసం అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యత లేకుండా చెక్ డ్యామ్ నిర్మాణం

**ఎండి జహంగీర్**

**రూ. 3 కోట్ల బడ్జెట్ తో నిర్మిస్తున్న చెక్ డాం లో అన్నీ లోపాలే**

**కట్ట నిర్మాణానికి నాసిరకం మట్టి**

**నాణ్యతలేని ఇసుకతో నిర్మాణం**

**వరదలు ఉధృతంగా వస్తే బ్రిడ్జి కూలిపోతుంది**

**ప్రజాధనం వృధా చేస్తున్న కాంట్రాక్టర్ అధికారులు**

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చి 28 సూర్యా న్యూస్ మోట కొండూరు సికిందర్ నగర్ చెక్ డ్యామ్ నిర్మాణంలో నాణ్యత లోపాలను అరికట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం కార్యదర్శి ఎండి జహంగీర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సికిందర్ నగర్ మోటకొండూరు మధ్యన పెద్ద వాగులో నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులను సిపిఎం పార్టీ బృందం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత విషయంలో చెక్ డాం దగ్గర నుండే అధికారులను ఫోన్లో సంప్రదించారు. అక్కడ జరుగుతున్న పనుల నాణ్యత విషయంలోని పలు అంశాలు పార్టీ బృందం దృష్టికి వచ్చాయి. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి జహంగీర్ మాట్లాడుతూ, సికిందర్ నగర్ మోటకొండూరు మధ్యన పెద్ద వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం సుమారు మూడు కోట్ల బడ్జెట్ తో నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, కానీ అక్కడ పనుల నాణ్యత విషయంలో అధికారుల పర్యవేక్షణ లోపం వాటిల్లిందని. దానివల్ల పనిలో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రధానంగా చెక్ డ్యామ్ కు ఇరువైపులా నిర్మిస్తున్న కట్ట నిర్మాణానికి వాడే మట్టి నాసిరకంగా ఉండటం వల్ల వరదలు ఉధృతంగా పెరిగినప్పుడు కట్ట కృంగిపోయే ప్రమాదం ఉందన్నారు.దీనితో ప్రజాధనం వృధా అయ్యే అవకాశం ఉన్నదని. చెక్ డ్యామ్ నిర్మాణానికి నాసిరకమైన ఇసుక ను వాడారని, పనులు హడావుడిగా జరుగుతున్న సమయంలో పనులు నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయని, అధికారులు నాణ్యత ప్రమాణాలని కచ్చితంగా పాటించాలని జహంగీర్ తెలిపారు. వెంటనే చెక్ డ్యామ్ నిర్మాణ లోపాలను అరికట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు బందెల పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించండి

**హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**కాశీ బుగ్గ ఈ-సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ**



హనుమకొండ టౌన్ మార్చి 28 సూర్య న్యూస్:- ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధి లోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ-సేవా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ-సేవా కేంద్రం లో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయి ల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలోని బకాయిలు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీసులు, కేఎంసి తదితర ప్రభుత్వ కార్యాలయాల కు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యు అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్స్పైర్ మాంక్ అవార్డ్స్ కు ప్రగతి విద్యార్థుల ఎంపిక




రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:- రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని ప్రగతి హై స్కూల్ కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇన్స్పైర్ మాంక్ అవార్డ్స్ కు ఎంపికైనట్లు కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇన్స్పైర్ మాంక్ అవార్డ్స్ కు ఎం. వర్షిని, ఎస్. ప్రసన్న దుర్గ ఎంపికయ్యారు. వీరు 2026 లోజరిగే సైన్స్ ఫెయిర్ లో షాకింగ్ గ్లోవ్స్ ఫర్ ప్రొటెక్షన్, ఆటోమేటిక్ షెల్టర్ ఫర్ స్ట్రీట్ వెండర్స్ అనే అంశాలతో పాల్గొంటారు. వీరి ఎంపికకు కృషిచేసిన గైడ్ టీచర్ టి. సత్యనారాయణను, విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి, ఇంచార్జ్ గోవర్ధన్ రావు, అధ్యాపక బృందం అభినందించారు.

## కన్స్యూమర్ మీడియేటర్ గోపాల్ నారాయణ సేవలు అభినందనీయం

**డిఎస్ఓ గంప శ్రీనివాస్**

**అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం కు పలు సూచనలు**



జడ్చర్ల, మార్చి 28 సూర్య న్యూస్: ప్రస్తుత సమాజంలో మోసాలు, కల్తీలు అధికమవుతున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయడంలో కన్స్యూమర్ కమిషన్ మీడియేటర్ దిద్దిగోపాల్ నారాయణ చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని మహబూబ్నగర్ డిఎస్ఓ గంప శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం ఈ మేరకు మహబూబ్నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి డిఎస్ గంప శీను శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గత కొన్నేళ్ల నుండి దిద్దిగోపాల్ నారాయణ కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలను డిఎస్ఓ కు వివరించారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో ప్రతిదీ అప్రమత్తం చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్న దిద్దిగోపాల్ నారాయణ, మల్దే శ్రీశైలంలను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా యూనివర్సల్ కన్స్యూమర్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్దే శ్రీశైలంకు డిఎస్ఓ పలు సూచనలు చేశారు. 2019 వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలని, అది ఒక వజ్రాయుధం లాంటిదని సూచించారు. అంతేకాకుండా కన్స్యూమర్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవలను అభినందించారు. త్వరలోనే జడ్చర్ల పట్టణంలో పెద్ద ఎత్తున 2019 వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు మల్దే శ్రీశైలం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిఎస్ఓ గంప శ్రీనివాస్ తో పాటు ఇతర జిల్లా ఉన్నతాధికాలను ఆహ్వానిస్తున్నట్లు మల్దే శ్రీశైలం తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్ఓ కు కన్స్యూమర్ కమిషన్ మీడియేటర్ దిద్దిగోపాల్ నారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతినెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలి

**-టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సాంబయ్య**



రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:- సింగరేణిలో ప్రతినెల రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఏరియా ఉపాధ్యక్షుడు నాగెళ్ళి సాంబయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం సింగరేణి సంస్థ ఆర్జీ 3, ఏపీఏ ఏరియాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన అనంతరం ఆయా గనుల అధికారులకు వినతిపత్రాలను సమర్పించి మాట్లాడారు. దేశాభివృద్ధికి తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్న బొగ్గు గని కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ, డ్యూటీలు చేయలేకపోతున్నారు. డ్యూటీలకు హాజరు కాకపోవడం వలన జీతం రాక, అప్పుల పాలవుతున్నారు. కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నారు. దేశంలోని ఇతర పరిశ్రమలకు భిన్నంగా బొగ్గు గని కార్మికులు పనిచేస్తారు. పని స్థలాలు కాలుష్యంతో, ప్రమాదాలతో నిండి ఉంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గతంలో వారసత్వ ఉద్యోగాలను కల్పించారు. చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రపూరితంగా వారసత్వ ఉద్యోగాలను రద్దు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు తీరని ద్రోహం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి సాహసోపేతంగా తిరిగి కారుణ్య నియామకాల పేరిట కార్మికుడి వారసులకు ఉద్యోగాలను పునరుద్ధరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సింగరేణి కార్మికులకు ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహించి, అధిక సంఖ్యలో కారుణ్య ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అదేవిధంగా ఏఐటియుసి, ఐఎన్టియుసి సంఘాలు కూడా సింగరేణి ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. వీరి మాటలు నమ్మిన కార్మికులు మోసపోయారు. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు నిర్వహించకుండా కార్మికుల జీవితాలతో సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నది. కారుణ్య నియామకాలలో అవినీతి, అక్రమాలు జరిగాయని వీటిపై ఏసీబీ, విజిలెన్స్ విచారణ చేస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. విచారణ పేరుతో మెడికల్ బోర్డును నిర్వహించకుండా నిలిపివేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తప్పు జరిగితే దోషులను శిక్షించండి. కానీ విచారణ పేరుతో మెడికల్ బోర్డు నిర్వహణను నిలిపివేయడం సరియైనది కాదు. తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి అర్హులైన వారందరిని "అన్ ఫిట్" చేసి వారి వారసులకు ఏలాంటి జాప్యం లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెల రెండు మెడికల్ బోర్డులను నిరంతరాయంగా నిర్వహించాలని, మెడికల్ అన్ ఫిట్ చేయబడిన కార్మికుడి వారసులు సింగరేణి నియమ, నిబంధనల మేరకు అర్హత కలిగి ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి తక్షణమే ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలి. జూలై, నవంబర్ నెలలలో అర్హత కలిగి అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు అన్ ఫిట్ చేయలేదు. వారికి తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించాలి. విజిలెన్స్ మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి. మెడికల్ బోర్డు రద్దుకై సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను విరమించుకోవాలి. గత సంవత్సర కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్న 2వేలకు పైగా కార్మికులకు న్యాయం చేయాలని వినతి పత్రం ద్వారా డిమాండ్ చేశారు. వేరువేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాలలో నాయకులు గిటకు శ్రీనివాస్, భోగం పూర్ణాకర్, బోయినపల్లి శ్రీకాంతరావు, అల్లం తిరుపతి, వేముల రవిశంకర్, చిప్ప సురేష్, దేవ శ్రీనివాస్, ఇసంపల్లి రమేష్, పాశం శ్రీనివాస్ రెడ్డి, దాసరి మల్లేష్, గండి శ్రీనివాస్, వీరగోని సంతోష్ గౌడ్, వివి గౌడ్, పూసాల శేఖర్, గట్టు శ్రీనివాస్, సందీప్ రెడ్డి, రాజయ్య, దేవరకొండ తిరుపతి, కొత్తపల్లి సదానందం, నరసింహారావు, అనిల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో గంజాయి సాగు కలకలం : యూపీ వ్యక్తి అరెస్ట్

**అగ్రహారం శివారులో గంజాయి మొక్కల స్వాధీనం**

**నిందితుడికి రిమాండ్**



వేములవాడ టౌన్ మార్చ్ 28 సూర్యా న్యూస్ :- వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అచ్చే లాల్ అనే వ్యక్తి అగ్రహారం శివారులో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారంపై తక్షణమే స్పందించిన ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, అక్కడ సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శ్రీనివాస్, పిసి మహిపాల్, పిసి సంతోష్ హోంగార్డ్ ఆనంద్‌లను డీఎస్పీ ఏ.శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా లేదా విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నవారు వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో.. ఆరోగ్య శిబిరం అభినందనీయం..

**రాజాపూర్ గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణ**



జడ్చర్ల మార్చి 28 సూర్య న్యూస్ రాజాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తరఫున ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని రాజాపూర్ గ్రామ సర్పంచ్ సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ కావలి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జనరల్ హాస్పిటల్ సంయుక్తంతో ప్రసూతి మరియు గైనకాలజీ జనరల్ ఫిజీషియన్ చిన్న పిల్లల డాక్టర్ ఎముకల డాక్టర్ కంటి డాక్టర్ మరియు దంత వైద్యులు ఎక్స్ రే తదితర రక్త పరీక్షలు ఈ శిబిరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. శనివారం నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 423 మంది పాల్గొంచుకోవడం జరిగిందని శిబిరాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన రాజాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుస్మితకు ఈ సందర్భంగా సర్పంచ్ కావలి రామకృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల అధికారులు, గ్రామ ఉపసర్పంచ్ రేష్మ నజీమ్ బేగ్, పలువురు వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాలు కొనసాగించాలి

**-టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు ఈసంపల్లి రమేష్**



రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:- సింగరేణిలో మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాలు కొనసాగించాలని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకుడు ఈసంపల్లి రమేష్ కోరారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎస్అండ్ పిసి డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి యాజమాన్యానికి మెడికల్ బోర్డు ద్వారా వారసత్వ ఉద్యోగాలను కొనసాగించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపార్ట్మెంట్ సెక్రటరీ దేవరకొండ తిరుపతి, బోట్ల శివ శంకర్, కొత్తపల్లి సదానందం, కనిగంటి రాజేశం, పోతరాజు శ్రీనివాస్, షేర్ల కుమార్, దుబాసి శ్రీనివాస్, కె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు కలగనీయకండి..

**రహదారి అధికారులకు సూచించిన సర్పంచ్ రామకృష్ణ**



జడ్చర్ల మార్చి 28 సూర్య న్యూస్ రాజాపూర్ మండల కేంద్రంలో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగు తున్నందున మండలవాసులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై వేగా నియంత్రికలు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని శుక్రవారం రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ జాతీయ రహదారి అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను సత్వరమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో శనివారం జాతీయ రహదారి అధికారులు, సిబ్బంది స్పందించి వాహనాల వేగం తగ్గేందుకు పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. మరి కొన్ని ప్రాంతాల్లో వేగ నియంత్రికలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ రామకృష్ణ వారికి సూచించారు. త్వరలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపడతామని జాతీయ రహదారి అధికారులు, సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ ఎస్ఐ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## నెల రోజుల అనంతరం, ఇరాన్‌కు మద్దతుగా ఇజ్రాయెల్‌పైకి హూతీల క్షిపణి దాడి

పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నెల రోజుల తర్వాత, ఇరాన్‌కు మద్దతుగా ఉండే యెమెన్ హూతీ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై మొదటిసారి దాడి చేశారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం ఓ వైపు దాడులు, మరోవైపు కాల్పుల విరమణకు సంప్రదింపులు జరుగుతున్న సమయంలో ఈ కీలకపరిణామం చోటుచేసుకుంది. హూతీలు మొదటిసారి కదనరంగంలోకి దిగారు.ఇజ్రాయెల్‌లోని సైనిక స్థావరాలు లక్ష్యంగా వారు క్షిపణి దాడులు నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై దాడులు చేసినట్లు హూతీల ప్రతినిధి యాహ్యా సారె ధృవీకరించారు.యెమెన్ నుంచి ప్రయోగించిన క్షిపణిని గుర్తించి, దాడిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఈ క్షిపణిని అడ్డుకున్నాయని వెల్లడించింది. హూతీల దాడితో ప్రాణ, ఆస్తి నష్టం కలిగినట్లు తెలియరాలేదు. యుద్ధంలోకి హూతీలు రావడం చమురు మార్కెట్‌కు ఆందోళన కలిగించే అంశం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు క్రియాశీలకంగా వ్యవహరించారు. పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గంలో వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారు. అయితే నెల రోజులుగా అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం జరుగుతున్నప్పటికీ హూతీలు కనిపించలేదు. తాజా దాడి చర్చకు దారితీసింది.

## హర్మూజ్ జలసంధి దాటిన రెండు భారత ఎల్పీజీ నౌకలు

భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శుక్రవారం నాడు దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

సూర్య

ఆదివారం 29 - 03 -2026

# చేనేత, వస్త్ర సాంకేతికతలో ప్రత్యేక కోర్సులకు ప్రవేశాలు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యూరో మార్చ్ 28 సూర్య న్యూస్ :-** హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, డిప్లొమా-స్థాయి విద్యకు ప్రాధాన్యతనిస్తూ చేనేత, వస్త్ర సాంకేతికతలో ప్రత్యేక కోర్సులను అందిస్తుందని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ పరిపాలనా నియంత్రణలో నడుస్తున్న కేఎల్బి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కొరకు మొదటి సంవత్సరానికి గాను అభ్యర్థులు పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఇంగ్లీషు ఒక సబ్జెక్టుగా కలిగి ఉండాలన్నారు. ప్రవేశాల ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వ రిజర్వేషన్ విధానాన్ని అనుసరిస్తుందన్నారు. అభ్యర్థుల వయస్సు గరిష్టంగా 23 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ, ఎస్ అభ్యర్థుల కోసం గరిష్ట వయస్సు 25 సంవత్సరాలు. ఇది 2026-27 విద్యా సంవత్సరం జూలై 16 నాటికి వర్తిస్తుందన్నారు. సీబీఎస్సీ, ఇతర విద్యా బోర్డులు 10వ తరగతి పరీక్షలకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తున్నందున, అభ్యర్థులు తమ మార్కుల ధృవీకరణ పత్రాలను (సీబీఎస్సీ లేదా సంబంధిత బోర్డు) దరఖాస్తుతో సమర్పించాలి. మెరిట్ జాబితా 10వ తరగతి మార్కుల ఆధారంగా మాత్రమే ఎంపిక చేయబడతుందన్నారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం విషయాలతో 10+2 ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 2వ సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశం కల్పిస్తారని, కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు నెలకు రూ.2,500 మాత్రమే స్టైపెండ్ ను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. ఈ సదవకాశాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.



# ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

**-టిపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు**



**రామగిరి మార్చి 28 సూర్య న్యూస్:-** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు 27వ వర్ధంతి సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి(సికింద్రాబాద్)ఆధ్వర్యంలో ఏప్రిల్ 3, 4 తేదీలలో ముత్తారంలో నిర్వహించనున్న ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరంను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు సూచించారు. ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 3న ముత్తారం, కేశనపల్లి దర్యాపూర్, హరిపురం, పోతారం, మైదంబండ, మచ్చుపేట, లక్కారం. ఏప్రిల్ 4న పారుపల్లి, ఓడేడు,అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, జిల్లలపల్లి, సీతంపల్లి, ఇప్పలపల్లి (రామకృష్ణాపూర్) గ్రామాల ప్రజలకు కంటి వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరములు దాటిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడునని, కంటి శస్త్ర చికిత్స చేసుకున్నవారికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వన్నట్లు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి హాజరయ్యే ప్రజల కోసం మధ్యాహ్నం 12.00 గంటల నుండి భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్ మరిపెడలో 200 మందికి చెక్కుల పంపిణీ



**డోర్నకల్ మార్చి 28 సూర్య న్యూస్:-** మరిపెడ మండలంలో పేదలకు సీఎంఆర్ఎఫ్ (చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్) నిజమైన వరంగా మారుతోంది. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 200 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తెలంగాణ డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రాంచందర్ నాయక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెక్కులను మరిపెడ మండల అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పెండ్లి రఘువీరారెడ్డి మాట్లాడుతూ, సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగించే పథకమని అన్నారు. పార్టీకి అతీతంగా ప్రతి పేదవాడికి అండగా నిలుస్తూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తున్నదని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి నాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్, యువజన నాయకులు బుర్ర నవీన్, బానోతు మహేష్ నాయక్, సీనియర్ నాయకులు వెంకన్న, వంశి, దశ్రు, బానోతు రెడ్డి నాయక్ తదితరులు పాల్గొన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబాటు మరోసారి స్పష్టమైంది.

# నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బ్యూరో మార్చ్ 28 సూర్య న్యూస్ :-**మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందిచాలనే లక్ష్యంతో షెడ్యూల్డు కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వారు ఎస్.సి యాక్షన్ ప్లాన్ 2025-26ఫేస్-2“ (కింద ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలు, (తిచక్ర ఎలక్ట్రికల్ ఆటో (ప్యాసింజర్/ గూడ్స్) వాహనాలు, సోలార్ యూనివర్సల్ పంప్ కం(టోల్, వ్యవసాయ అనుబంధ భాగాల యూనిట్లు, వ్యవసాయ డ్రోన్ (సేవలు), వ్యవసాయ యంత్రాల సాధారణ అద్దె కేంద్రం (5గురి గ్రూపుకు), (2)బర్రెలు, పట్టు పరిశ్రమకు సంబంధించి మల్బరీ సాగు, చాకీ కేంద్రం, నీటి పారుదల సౌకర్యంతో కూడిన కిసాన్ నర్సరీ, ఉద్యానవన పంటలు కూరగాయల పందిళ్లు / ఆయిల్ పామ్ మొదలైన పథకాలతో లోన్లు ప్రకటించడం జరిగింది. వయస్సు 21-50 సం.,లు కల అభ్యర్థులు ఉపాధి హామీ పథకాలకు, 21-60 సం.,లు కల అభ్యర్థులు భూసంబంధ, వ్యవసాయ/ సోలార్ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకొనగలరు. అభ్యర్థి సంవత్సర ఆదాయం గామీణ పాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ / మున్సిపాలిటీ పాంతాల వారికి రూ.2.00 లక్షలు మించి ఉండరాదు. మీ-సేవ నుండి పొందిన కులం, ఆదాయ ధృవపత్రం, ఆధార్ కార్డ్, ఫుడ్ సెక్యూరిటీ కార్డ్, పర్మనెంట్ (డ్రైవింగ్ లైసెన్స్, పట్టదారు పాస్ పుస్తకం కలిగిన దారిద్ర్య రేఖకు దిగువన కల అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకొనగలరు. కావున అర్హత మరియు ఆసక్తికల షెడ్యూల్డు కులాల అభ్యర్థులు డి జి ఓ బి ఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ట్రిజూం:7/స్రశీఎఎంఅవష.ఎస్త్రస్త.స్రశీజ.అఅ ద్వారా దరఖాస్తులు తేదీ:02.04.2026 వరకు నమోదు చేసుకోవచ్చును. మరిన్ని వివరాల కొరకు జిల్లాలోని ఎస్.సి కార్పోరేషన్ కార్యాలయం, మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా, రూమ్ నెం.ా-16,గ్రాష్ట్ర.చీశీ. 040-24020610, రెండవ అంతస్తు, సమీకృత జిల్లా కార్యాలయముల సముదాయము, కలెక్టరేటు (ఐడిఓసి) నందు సంప్రదించగలరు.

# ప్రజా సేవలో 5వ వార్డ్ కౌన్సిలర్ కు ఘన సన్మానం

**శంకర్ పల్లి మార్చి 28 సూర్య న్యూస్ :-** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని బుల్కాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్, ఆశా వర్కర్లు 5వ వార్డు కౌన్సిలర్ భానూరి కృష్ణని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ సన్మానం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎప్పటికప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# శిల్పారామంలో శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు





**మాదాపూర్ మార్చ్ 28 సూర్య న్యూస్ :-** మాదాపూర్ లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సా నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి కుమారి శృతి శ్రీనిధి తన ప్రదర్శనలో మహాదేవ శంభో, మాత మలయధ్వజ, ఎహ్మని తెలుపుదు, శ్రీరామచంద్ర అంశాలను ప్రదర్శించి మెప్పించింది. సాంప్రదాయ భరతనాట్యం డాన్స్ స్కూల్ చెన్నై నుండి విచ్చేసిన భరతనాట్య గురువు శృతి ప్రియా విగ్నేష్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో హరినారాయణ కౌతం, వర్ణం, శ్రీ రామచంద్ర కృపాలు భజన, అష్టపడి, బారో కృష్ణయ్య, తిల్లాన, అభంగ్ అంశాలను ఆధ్య, ఆదర్శిని, రేఖ, మాళవిక,
నిహారిక, వర్ష, సహన, నిత్య, అవనిజ మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సభ్యుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కు సత్కారం

**కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణానికి నివేదిక సిద్ధం**



**శంకర్ పల్లి మార్చి 28 సూర్య న్యూస్ :-** క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మున్సిపాలిటీ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, కమిషనర్ యోగేష్ కుమార్, ఒకటవ వార్డ్ కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, పదవ వార్డ్ కౌన్సిలర్ రాజండ్ల వసంత మహేంద్రరెడ్డిలను సత్కరించారు.క్రిస్టల్ టౌన్షిప్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు మొదలైన అంశాలపై చర్చ జరిగింది. చైర్మన్, కమిషనర్ సమస్యలను పరిష్కరించేందుకు ఇంజనీర్‌ను పిలిచి నివేదిక తయారు చేయాలని తెలిపారు.కాలనీవాసులు, సెంట్రలైజ్డ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, కమిషనర్ యోగేష్ కుమార్, వార్డు కౌన్సిలర్లు సమగ్రంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఎం విఠలయ్య, కొలాన్ గోవింద్ రెడ్డి, అధ్యక్షులు కొలను ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీర హనుమాన్ శోభాయాత్రకు హాజరవ్వాలని కూన శ్రీనివాస్ గౌడ్ కి ఆహ్వానం



**కుత్బుల్లాపూర్ మార్చ్ 28 సూర్య న్యూస్ :-** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జీడిమెట్ల గ్రామంలో గల శ్రీ పాత ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల ఏప్రిల్ రెండో తేదీ నాడు సాయంత్రం నిర్వహించే శ్రీ వీర హనుమాన్ విజయోత్సవ శోభాయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని షాపూర్ నగర్ లోని నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ని ఆహ్వానించిన కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమం కమిటీ సభ్యులు శేఖర్, కళ్యాణ్, సాయి, సందీప్, జంగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలప్ప పాల్గొన్నారు.

# దూలపల్లి లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

**కొంపల్లి మార్చి 28 సూర్య న్యూస్ :-** దూలపల్లి డివిజన్ పరిధిలోని హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ సమీపంలో గత రెండు రోజులుగా డ్రైనేజీ పొంగిపొర్లుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని, జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసిన ఇటువైపు చూడడం లేదని చూస్తాం పంపిస్తామని మాటలు చెబుతూ కాలనీవాసులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు తెలిపారు. చిన్న చిన్న సమస్యలనే పరిష్కరించలేని అధికారులు, నాయకులు ప్రజా సమస్యలను ఇంకా ఏదైనా ఇబ్బందులు వస్తే ఎలా పరిష్కరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్య పరిష్కరించకుండా వదిలేస్తే కాలనీవాసులు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, రోడ్లపై నడవడానికి కూడా సమస్య ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



# మారనున్న ఆస్కార్ వేడుకల వేదిక 2029 నుంచి పీకాక్ థియేటర్‌లోకి మార్పు

ప్రపంచ చలనచిత్ర రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'అకాడమీ అవార్డ్స్' ఆస్కార్ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమవుతోంది. దశాబ్దాలుగా హాలీవుడ్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలు, 2029 నుంచి లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని కొత్త వేదికకు మారనున్నాయి. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రకటించిన వివరాల ప్రకారం, 2029 నుంచి 2039 వరకు పదేళ్ల పాటు ఈ వేడుకలు లాస్ ఏంజిల్స్ లైవ్ కాంప్లెక్స్‌లోని 'పీకాక్ థియేటర్'లో జరగనున్నాయి. ఇందుకోసం ప్రముఖ వినోద సంస్థ తో అకాడమీ ఒప్పందం కుదుర్చుకుంది. 2001 నుంచి ఆస్కార్ వేడుకలకు ఆతిథ్యం ఇస్తున్న హాలీవుడ్ బౌలేవార్డ్ లోని 'డాల్బీ థియేటర్' యుగం, 2028లో జరగబోయే

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్‌ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం, హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల



విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# అపర్ణ పామ్ గ్రోవ్లో లో ఘనంగా సీత రాముల కళ్యాణం



**కొంపల్లి మార్చి 28 సూర్య న్యూస్ :-** కొంపల్లి డివిజన్ పరిధిలోని అపర్ణ పామ్ గ్రోవ్లో ఘనంగా సీత రాముల కళ్యాణం నిర్వహించారు. అపర్ణ గురు పార్కు స్థలంలో గణేష్ మండపం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ సభ స్థలంలో ఉత్సవ మూర్తిలను ప్రతిష్టించి వివిధ పూలతో అలంకరించి శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ఎదుర్కోలు కన్యాదానం జిలకర బెల్లం, మంగళసూత్రం వేద మంత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ రాజి రెడ్డి, కొంపల్లి డివిజన్ అధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్ సాగర్, అనంతరం అన్నదాన కార్యక్రమం పానకం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని శ్రీరాములు ఆశీస్సులు పొందారు భక్తులు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళ్యాణ కమిటీ సభ్యులు గోపాల్ రావు, ధర్మగడ్డ శ్రీనివాస్, గుండా శ్రీధర్, అజయ్ కుమార్, ఎస్.నరసింహ రెడ్డి, పి.నరసింహ రెడ్డి, ఎన్ శ్రీధర్ రెడ్డి, సరిత, సూర్యకళ, భారత్ కుమార్, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.



# మాలి నీరజారెడ్డికి మృతికి నివాళులర్పించిన,బాల్యమిత్రులు



**ఆలేరు, మార్చ్, 28 సూర్య వెలుగు.** ఆలేరు మండలం మండల కేంద్రం,లో కొల్లూరు గ్రామానికి చెందిన మాలి నీరజ రెడ్డి, గత కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతూ,తండ్రి మాలి రంగారెడ్డి గత వారం రోజుల క్రితం మృతి చెందారు ఆ బాధతో తీవ్ర దిగ్భ్రాంతి గురై, మాలి నీరజ రెడ్డి నిన్న రాత్రి హైదరాబాదులో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మరణించారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న తన బాల్యమిత్రులు, కొల్లూరు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నీరజా రెడ్డి తన తోటి, విద్యార్థులతో, చదువుకున్నపూర్వ విద్యార్థులు ఎస్,ఎస్సి బ్యాచ్ 1995-1996. విద్యార్థులు మాలినీరేజ రెడ్డి సందర్శించి పూలమాలు వారి కూతురికి ఆర్థిక సాయం అందజే, సిపరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్, ఎస్సి, పూర్వ విద్యార్థులు మహమ్మద్ గౌస్ పాషా, పచ్చిమట్ల రాజు వార్డు సభ్యులు మహమ్మద్ ముస్తఫా, జంపాల సత్యనారాయణ, నోముల వెంకటేష్, నోముల మల్లేష్, జనగాం శ్రావణ్ కుమార్ రెడ్డి , ఇక్కుర్తి అశోక్, వెంకటేష్, యాదవ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయస్థానం నోట కార్పొరేట్ మాట

ఇటీవల సుప్రీంకోర్టు మహిళల ఋతుస్రావ సందర్భంలో నెలసరి సెలవు విధానం దేశవ్యాప్తంగా తప్పనిసరి చేస్తే, మహిళల నియామకంలో కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, తద్వారా సమానత్వానికి హాని కలగవచ్చని ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం సందర్భంగా అభిప్రాయం వ్యక్తం చేసింది. దానికి బదులుగా స్వచ్ఛంద లేదా యజమాని నిర్దిష్ట చర్యలను సూచించింది. కేంద్ర ప్రభుత్వం సంబంధిత వర్గాలతో సంప్రదించి విధానం రూపొందించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించినా, ఆ సెలవులను తప్పనిసరి చేయడాన్ని నిరాకరించింది. ఈ విధమైన వాదన 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట కార్మిక హక్కులను అడ్డంకులుగా చూపించే నయా ఉదారవాద దృక్పథానికి అనుగుణంగా ఉండి, కీలకమైన సామాజిక, ఆర్థిక చర్చను తెరపైకి తెచ్చింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు యజమాన్యాల దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయి. మహిళలపై ఉన్న వివక్షను ఎదుర్కొనే బదులు, ఆ భారాన్ని మహిళలపైనే మోపుతున్నాయి. యాజమాన్యాలు వివక్ష చూపవచ్చనే కారణంతో మహిళల హక్కులను తగ్గించడం అంగీకారం కాదు. ఆ తర్కాన్ని అనుసరిస్తే ప్రసూతి సెలవులు, భద్రతా ప్రమాణాలు, సమాన అవకాశాల వంటి పురోగమన చట్టాలు ఎప్పటికీ అమలులోకి వచ్చేవి కావు. ఇప్పటికే నియామకం, పదోన్నతుల్లో మహిళలు వివక్ష ఎదుర్కొంటున్నారు. కాబట్టి రక్షణ చర్యలను తగ్గించడం కాకుండా వివక్ష వ్యతిరేక చట్టాలను కఠినంగా అమలు చేయాలి. నెలసరి సమయంలో చాలా మంది మహిళలు శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడతారు. అలాంటి సమయంలో సెలవు ఇవ్వడం ఒక ఆరోగ్య హక్కు. భారతదేశంలో నెలసరి సెలవు ఇప్పటికీ పట్టించుకోని అంశంగా ఉంది. దేశ జనాభాలో సుమారు 26శాతం అంటే దాదాపు 36 కోట్ల మంది ఋతుస్రావ ధర్మాన్ని అనుభవిస్తున్నారు. ఇది సహజమైన శారీరక ప్రక్రియ అయినా, 5090శాతం మహిళలు తీవ్రమైన నొప్పిని అనుభవిస్తారని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే దీర్ఘకాలిక సమస్యలు, అధిక రక్తస్రావం, అలసట వంటి లక్షణాలను కలిగిస్తాయి. అలాంటి సమయంలో కూడా షాపులు, మాల్స్ వంటి సంస్థలలో 8 నుంచి 12 గంటల వరకు కేవలం నుంచుని మాత్రమే పనిచేయడం ఎంతో దుర్భరం. ప్రస్తుతం దేశమంతా వర్తించేలా, అన్ని కంపెనీలకు తప్పనిసరి చేసేలా కేంద్ర చట్టం లేదు. కొన్ని రాష్ట్రాలు, సంస్థల్లో పరిమితంగా ఉంది. కర్ణాటక నెలకు ఒకరోజు నెలసరి సెలవును తప్పనిసరి చేసింది. బిహార్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు నెలసరి సెలవులు ఉన్నాయి. కేరళలో విద్యార్థులకు కూడా ఈ సౌకర్యం కల్పించారు. జపాన్, ఇండోనేసియా, జాంబియా, ఇటలీ, స్పెయిన్, ఐర్లాండ్, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ఈ విధానం అమలులో ఉంది. ఇది సానుకూల ఫలితాలను ఇస్తోంది. ఇది కేవలం ఆరోగ్య హక్కు మాత్రమే కాదు. శ్రమ, ఉత్పత్తి వ్యవస్థ, లింగ అసమానతల మధ్య ఉన్న సంబంధాన్ని చూపించే అంశంగా కనిపిస్తుంది. కార్ల్ మార్క్స్ చెప్పినట్టు కార్మికుడు తన శ్రమ శక్తిని అమ్ముకుంటాడు. కానీ ఆ శ్రమ శక్తి మానవ శరీరానికి సంబంధించినది. మహిళల విషయంలో నెలసరి ఒక సహజ శారీరక ప్రక్రియ. ఇది ఇక సామాజిక, మానవీయ దృక్పథం. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలను, అందుకు అనుగుణంగా కార్మికుడు సృష్టించే ఉత్పాదకతను మాత్రమే విలువగా చూస్తారు. అయితే సమాజానికి ఉత్పత్తి ఎంత అవసరమో, సమాజ మనుగడకు పునరుత్పత్తీ అంతే అవసరం. అయితే పెట్టుబడిదారీ సామాజిక వ్యవస్థ ఫ్యాక్టరీ, ఆఫీస్ పనికి ఇచ్చే ప్రాధాన్యం పునరుత్పత్తి అంటే పిల్లల పెంపకం, గృహ పని, శారీరక ప్రక్రియలు వంటి వాటికి ఇవ్వదు. అసమానతలు నిండిన సమాజంలో సమానత్వం అంటే అందరికీ ఒకే నియమం సరిపోదు. అవసరాల ప్రకారం సహాయం అవసరం అన్నారు బాబా సాహెబ్ అంబేద్కర్. ఇది కేవలం సెలవు ఇవ్వాలా లేదా అనే ప్రశ్న కాదు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అనే కోణం నుంచి చూడాలి. దీనికనుగుణంగానే అంబేద్కర్ రాజ్యాంగంలో ఱఅస్త్రఅఓఎ శీట్ఫ్త్రవ ×అఎఐఅజఅఎఋశ్రీకి చాలా ప్రాధాన్యం ఇచ్చారు. నెలసరి సమయంలో మహిళలు ఇబ్బందులు పడినా పని చేయాల్సి వస్తే అది వారి గౌరవానికి భంగం. ఈ దృక్పథం నుంచి చూస్తే 'హక్కులు ఇస్తే ఉద్యోగాలు తగ్గుతాయి' అని చెప్పడం సామాజిక న్యాయానికి విరుద్ధం. ఎందుకంటే వివక్షతను నిర్మూలించడం ప్రభుత్వ బాధ్యత, హక్కులను తగ్గించడం కాదు. అందువల్ల నెలసరి సెలవు ఒక సౌకర్యం కాదు. ఇది సామాజిక న్యాయం, గౌరవం, కార్మిక హక్కు. మన రాజ్యాంగంలో ఆర్టికల్ 14 సమానత్వ హక్కు కల్పిస్తోంది. దీని సాధనకై ఆర్టికల్ 15(3) అవసరాల ప్రకారం మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక చట్టాలు చేయడానికి అనుమతి ఇస్తోంది. ఆర్టికల్ 21 జీవన హక్కును కల్పిస్తోంది. అందువల్ల ఋతుస్రావ కోణంలో ఆరోగ్యం, శారీరక సౌకర్యం వంటివి ఆర్టికల్ 21లో భాగం. అన్నింటికీ మించి ఆరోగ్య హక్కు రాజ్యాంగంలో ప్రత్యేకంగా లేకపోయినా సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఆర్టికల్ 21లో భాగంగా గుర్తించారు. నెలసరి సెలవు కూడా ఇందులోకి వస్తుంది. అలాగే ఆర్టికల్ 16 ఉద్యోగాలలో సమాన అవకాశాలు కల్పిస్తోంది. ఋతుస్రావం కారణంగా మహిళలను నియమించకపోతే అది రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. అందువల్ల నెలసరి సెలవు ఆరోగ్యం, శ్రేయస్సు కోసం అవసరమైన హక్కు. మహిళలు శారీరకంగా ఇబ్బంది పడుతున్నప్పుడు పని చేయమని ఒత్తిడి చేయడం శ్రమ దోపిడీయే. కానీ నేటి సమాజంలో అమానవీయంగా కార్మికుల శ్రమను దోచుకోవడమే కార్పొరేట్ కంపెనీల విధానం. దీనికనుగుణంగానే కార్మిక హక్కులను కబళిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన లేబర్ కోడ్లు. వాస్తవంగా నేడు అసంఘటిత రంగాలలో ఉన్న చట్టాలే సరిగా అమలుకావడం లేదు. అటువంటి నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఒక పటిష్ఠ చట్టం అవసరాన్ని తెలపవలసిన సమయంలో అసలు దీన్ని ఒక భారంగా చూడడం కార్పొరేట్ ప్రయోజనాల రక్షణకే ఉపయోగపడుతుంది. సుప్రీంకోర్టు చెప్పినట్లు యాజమాన్యాలు స్వచ్ఛందంగా అమలు చేయాలనడం హాస్యాస్పదమే కాక, వారి దయాదాక్షిణ్యాలకు వదిలివేయడమే. అందువల్ల మార్కెట్ అవసరాల కోణం నుంచి కాకుండా సమానత్వం, సామాజిక న్యాయం, గౌరవం, సామాజిక అభివృద్ధి వంటి కోణాల నుంచి ఈ అంశాన్ని చూడాలి. దేశవ్యాప్తంగా అన్నిరంగాలకు వర్తించేలా ఒక చట్టాన్ని చేయవలసిన అవసరం ఉంది.



# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### తదుపరి తమ టార్గెట్÷- క్యూబా అంటూ హెచ్చరిక

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపుతోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబాకు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది. జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

**ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక**

హైదరాబాద్,మార్చి28(ఆర్ఎన్ఎ): బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి.

# డీసీసీ కార్యవర్గాన్ని నియమించేదెన్నడో..?

అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గం, కమిటీల నియామకంలో జాప్యం చేస్తుండడంతో కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. కాంగ్రెస్ పార్టీ ఇటీవల మళ్లీ సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో వేగం పెంచింది. ఇప్పటికే డీసీసీ అధ్యక్షులను నియమించిన పార్టీ, తాజాగా కొన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి కమిటీలను ప్రకటించింది. అయితే జగిత్యాల జిల్లాలో మాత్రం ఇంకా పూర్తి స్థాయి కార్యవర్గం, కమిటీలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇటీవల ఉగాది సందర్భంగా రాష్ట్రంలోని 14జిల్లాల్లో పూర్తి స్థాయి జిల్లా కాంగ్రెస్ కమిటీలను ప్రకటిం చారు. వీటిలో వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రెటరీలు, ట్రెజరర్, అధికార ప్రతినిధులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో పాటు విస్తృత స్థాయి నిర్మాణం పూర్తి చేశారు. జగిత్యాల జిల్లాలో డీసీసీ అధ్యక్షుడి జాబితాతో ఆగిపోయింది. పూర్తి స్థాయి కమిటీలకు మోక్షం కలగకపోగా పార్టీ పదవులను ఆశిస్తున్న వారిలో ఉత్కంఠ నెలకొంది.

**కార్యవర్గం నియామకంపై తర్జనభర్జన** డీసీసీ అధ్యక్షుడిని 2025 నవంబరు 22వ తేదీన ప్రకటించారు. జగిత్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గాజంగి నందయ్యకు డీసీసీ అధ్యక్షుడిగా పార్టీ పగ్గాలు అప్పగించింది. పూర్తి స్థాయి కార్యవర్గం కాని, అనుబంధ కమిటీలు గాని నియామకం జరగలేదు. దీంతో జిల్లాలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు అలకకు గురికాగా, కేడర్‌లో తర్జన భర్జన జరిగింది. తాజాగా పూర్తి స్థాయి కమిటీల కూర్పు విషయం వచ్చే సరికి మళ్లీ రాజకీయ సిఫారుసులు పెరగడం తలనొప్పిగా మారుతుందన్న చర్చ పార్టీ నేతల్లో సాగుతోంది.

**సమన్వయం కుదరక పెండింగ్** నాలుగు నెలల కిందటే డీసీసీ అధ్యక్షుడిని నియమించిన కాంగ్రెస్ అధిష్ఠానం పలు జిల్లాల్లో పూర్తి స్థాయి కమిటీలను ఇంకా పెండింగ్‌లోనే పెట్టింది. దీంతో స్థానిక కేడర్‌లో గందరగోళం నెలకొంది. వాస్తవానికి ఫిబ్రవరి చివరి వారంలోనే జిల్లాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, తదితర పోస్టులకు టీపీసీసీకి జాబితా పంపడంలో సమన్వయం కుదరనట్లు తెలిసింది. ఉగాది సందర్భంగా 14 జిల్లాల కమిటీలను ప్రకటించిన అధిష్ఠానం జగిత్యాల జిల్లా కమిటీని మాత్రం ప్రకటించలేదు. జిల్లా కమిటీల్లో అన్ని పోస్టుల్లో కలిపి 30నుంచి 50 మంది దాటకుండా ఉండేలా జాబితా రూపొందించాల్సి ఉండగా అంతకుమించి పంపడం వల్ల వడపోత చేస్తున్నారని చెబుతున్నారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో నెలకొన్న సంక్షోభం సైతం ప్రభావం చూపుతోందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి అసంతృప్తికి గురికావడం, కాంగ్రెస్ రాజీనామాకు దారి తీయడం చోటుచేసుకుంది. జిల్లాలో కీలక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నేతల మధ్య పొసగక పోవడం వల్ల పలు ప్రాంతాల నుంచి కూడా జంబోజెట్ జాబితా వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలు అధిష్ఠానం పరిశీలనలోనే ఉండగా జగిత్యాల జిల్లా జాబితా ప్రకటనపై మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నట్లు కార్యకర్తలు అంటున్నారు. చాలాచోట్ల గ్రూప్ రాజకీయాలు, కీలక ప్రజాప్రతినిధులు, నేతలు, నియోజకవర్గ స్థాయి నాయకులు, ఎమ్మెల్యే స్థాయి నేతలు, స్థానిక నేతల మధ్య ఆదిపత్య పోటీ కారణంగా కమిటీలు ఆలస్యం అవుతున్నాయన్న చర్చ జరుగుతోంది.

# మూసీ శాశ్వత వరం!

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం మూసీ పునరుద్ధరణను కేవలం ఒక సుందరీకరణ ప్రాజెక్టుగా కాకుండా పర్యావరణ పరిరక్షణ, నగర అభివృద్ధి, ప్రజా జీవన ప్రమాణాల మెరుగుదలకు సంబంధించిన సమగ్ర కార్యక్రమంగా రూపుదిద్దుతోంది. తెలంగాణ అసెంబ్లీలో సమర్పించిన ప్రణాళికల ప్రకారం సుమారు 55 కిలోమీటర్ల మేర విస్తరించే మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. మొదటి దశకు దాదాపు రూ.5,812 కోట్ల వ్యయం అంచనా వేయగా, ఇటీవలి బడ్జెట్‌లో రూ.1,500 కోట్లను ప్రత్యేకంగా కేటాయించడం ద్వారా ప్రభుత్వం తన ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేసింది.మూసీ చరిత్ర ఎంతో గొప్పది. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టి దాదాపు 267 కిలోమీటర్ల మేర ప్రవహించే ఈ నది నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. ఒకప్పుడు మూసీ పరివాహక ప్రాంతాల్లో విస్తారంగా సాగు జరిగేది. అనేక రకాల చేపలు, జీవ వైవిధ్యం ఈ నదిలో కనిపించేవి. నగర అభివృద్ధి వేగంతో ఈ సహజ సంపద క్రమంగా నశించింది. ప్రస్తుతం మూసీ కాలుష్యం నగర ప్రజల ఆరోగ్యానికి కూడా సవాలుగా మారింది. మూసీ చరిత్రలో 1908 వరద ఒక పెద్ద మలుపు. ఆ విపత్తులో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత నగరాన్ని రక్షించేందుకు ఓస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి జలాశయాల నిర్మాణం జరిగింది. ఈ జలాశయాలు నగరానికి తాగునీరు అందించడమే గాక, వరద నియంత్రణలో కూడా కీలకపాత్ర పోషించాయి. అయినప్పటికీ తరువాతి దశాబ్దాల్లో కూడా పలుసార్లు వరదలు సంభవించడం మూసీ పరివాహక ప్రాంతాల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూనే ఉంది. మూసీ పునరుద్ధరణకు గతంలో కూడా పలు ప్రయత్నాలు జరిగాయి. వివిధ ప్రభుత్వాలు పలు పథకాలు ప్రకటించినప్పటికీ అవి పూర్తి స్థాయిలో అమలు కాలేకపోయాయి. నిధుల కొరత, పరిపాలనా సమస్యలు, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వంటి కారణాలతో ఆ ప్రణాళికలు నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకున్న చర్యలు మాత్రం స్పష్టమైన లక్ష్యాలు, సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రుల నేతృత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఈ దిశగా తీసుకుంటున్న చర్యలు నగర భవిష్యత్తుపై కొత్త ఆశలను కలిగిస్తున్నాయి. మూసీని కేవలం శుద్ధి చేయడం మాత్రమే గాక, బాపుఘాట్ ప్రాంతాన్ని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయడం, గాంధీ సరోవర్ నిర్మాణం, పచ్చదనంతో కూడిన పార్కులు, నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాక్‌లు, వినోద స్థలాల ఏర్పాటు వంటి ప్రతిపాదనలు నగర సౌందర్యాన్ని పెంచేలా ఉన్నాయి. బాపుఘాట్ వద్ద మహాత్మాగాంధీ విగ్రహం, మ్యూజియం, అన్ని మతాల ప్రార్థనా మందిరాల నిర్మాణం వంటి ప్రతిపాదనలు మూసీని ఒక సాంస్కృతిక సమన్వయ కేంద్రంగా మార్చే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. మరో ముఖ్య అంశం మూసీకి శాశ్వత నీటి ప్రవాహాన్ని కల్పించడం. గోదావరి జలాలతో మూసీకి నీటి ప్రవాహం పెంచే చర్య అమలైతే మూసీ శుద్ధీకరణకు దీర్ఘకాలిక పరిష్కారం లభించినట్టే. అదే సమయంలో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న అక్రమ కబ్జాలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పేదలకు పునరావాసం కల్పిస్తూ, నదిని కాపాడే సమతుల్య విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ప్రపంచంలోని అనేక నగరాలు తమ నదులను పునరుద్ధరించి నగర అభివృద్ధికి మార్గదర్శకంగా మార్చుకున్నాయి. లండన్‌లో థేమ్స్ నది, దక్షిణ కొరియాలో సియోల్ నగరంలోని చియోంగ్‌జియోన్ నది ఇందుకు మంచి ఉదాహరణలు. ఒకప్పుడు కాలుష్యానికి గురైన ఆ నదులు ఇప్పుడు ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా మారాయి. అదే తరహా మార్పు మూసీకి కూడా సాధ్యమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నదిని కాపాడటం అంటే కేవలం ఒక జలవనరును సంరక్షించడం మాత్రమే కాదు నగర భవిష్యత్తును భద్రపరచడం. తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రయత్నాలతో హైదరాబాద్ తన సహజ వైభవాన్ని తిరిగి పొందగలదు.

# రాజీ మార్గమే రాజ మార్గం

రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి పేర్కొన్నారు. కేసుల పేరుతో యేళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి మాట్లాడుతూ జాతీయ మెగా లోక్ అదాలత్‌లో సమిష్టి కృషితో 3034 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. ఇందులో సివిల్ 37, క్రిమినల్ 2473, ఫ్రీ లిటిగేషన్ కేసులు 524 పరిష్కారం అయ్యాయన్నారు. 10 మోటర్ యాక్ట్ సంబంధించిన కేసులు పరిష్కారం కాగా వాటికి సంబంధించి రూ.69,05,000 నష్ట పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ముగ్గురు దంపతులకు సంబంధించిన కేసులలో రాజీ కుదరగా న్యాయమూర్తుల సమక్షంలో వారు మళ్లీ పూల దండలు మార్చుకొని ఏకమయ్యారు. ఈ సందర్భంగా వివిధ కారణాలతో తల్లిని కోల్పోయి, కొందరు తండ్రిని కోల్పోయి అనాథలుగా మారిన ముగ్గురు బాలికలను జిల్లా బాలల సంరక్షణ విభాగ్ మిషన్ వాత్సల్యలో భాగంగా వారికి పునరావాస చర్యలు చేపట్టి పలు కస్తూర్బా పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా మొదటి అదనపు జడ్జి నారాయణ, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సబ్ జడ్జి వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనిజ, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిఖిష, బార్ అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

## నియామకాల్లో తీరని జాప్యం

## ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి

## అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷–లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

## వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు

భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది.స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీబిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# మంటలు చెలరేగి కారు దగ్ధం

బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

## డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పెస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

## ఆకస్మిక గుండెపోటుతో మృతిపై ఆందోళన

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది.

తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

EDITED, PUBLISHED AND OWNED BY N.MAHESHWAR REDDY PUBLISHED AT D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYD - 500054, TELANGANA. PRINTED AT SRI LAKSHMI OFFSET PRINTERS AND PUBLICATIONS D.NO. 48-549, GANESH NAGAR, CHINTAL, QUTHBULLAPUR, MEDCHAL DIST. HYDERABAD -500 054. RNI TELTEL 2024/90138, CONTACT NO: 8985586689, EMAIL: suryavelugutelanganadesk@gmail.com, Web SITE: www.suryavelugu.com